

నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో నిర్మల్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి సల్లా రాజేంద్రప్రసాద్

## ప్రతిపక్షాలకు ఓటడిగే నైతిక హక్కు లేదు

- **నిర్మల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి**
- **నామినేషన్ కోసం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రూ. 30,931 విరాళం**

లక్ష్మణచాంద, నవంబర్ 6: ప్రతిపక్షాలు దశాబ్దాల తరబడి రాష్ర్టాన్ని పాలించి ప్రజలను మోసం చేసి ఓట్లడిగే నైతిక హక్కును కోల్పోయాయని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నిర్మల్ జిల్లా ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే ఓటడిగే హక్కు ఉందని తెలిపారు. బీజేపీ అభ్యర్థులు మత విద్వేషాలను పెంచి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. కాగా.. లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ సైనికుడు సల్లా రాజేంద్రప్రసాద్ తన నెల పెన్షన్‌ను అల్లోల నామినేషన్ కోసం రూ. 30,931 విరాళాన్ని చెక్కు రూపంలో మంత్రికి అందజేశారు. మంత్రి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## • వర్షంలోనూ స్పీకర్ ప్రచారం



శాసన సభాపతి, బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగా సోమవారం రుద్రూర్ మండలంలో విస్తృతంగా పర్యటించిన స్పీకర్.. వర్షంలోనూ ప్రచారం చేశారు. 74 ఏండ్ల వయస్సులోనూ నవ యువకుడిలా ఊరూరు తిరుగుతూ ఓటర్లను కలుస్తున్నారు. -రుద్రూర్

# అభివృద్ధి చేసే కేసీఆర్ కావాలా? అబద్ధాల కాంగ్రెస్ కావాలా?

- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

గంగాధర, నవంబర్ 6: తెలంగాణ రాష్ర్టాన్ని అభివృద్ధి చేసే సీఎం కేసీఆర్ కావాలా? అబద్ధాల హామీలతో గద్దెనెక్కాలని చూసే కాంగ్రెస్ పార్టీ కావాలో? ప్రజలు ఆలోచించుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌తో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంగళహారతులతో వినోద్‌కుమార్, రవిశంకర్‌కు స్వాగతం పలికారు. వినోద్‌కుమార్‌ను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ర్టాన్ని ఆగం చేస్తారని తెలిపారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రైతులు రాత్రి పూట పొలాల వద్దకు వెళ్లడానికి టార్చిలైట్లు కొనుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి 1000 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. 33 జిల్లాల్లో 33 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో ప్రతి యేడాది 10 వేల మంది వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం ఏర్పడిందని వివరించారు.





## కరువు నేలలో దండిగా ధాన్యం

- **ఎన్నికలున్నా కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం**
- **రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం తరలింపు**

జనగామ రూరల్, నవంబర్6: గతంలో కరువును కండ్లరా చూసిన జనగామ.. నేడు దండిగా ధాన్యం రాశులతో కళకళలాడుతూ అన్నపూర్ణగా వెలుగొందుతున్నది. ఎన్నికలు ఉన్నా రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నది. వారం రోజుల్లోనే రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నది. జనగామ జిల్లా జనగామ మండలం సిద్దెంకి గ్రామంలో సోమవారం ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కార్మికులు లారీల్లోకి లోడింగ్ చేశారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




















